క్లుప్తంగా

సేవాలాల్ జయంతి వేడుకలను జయప్రదం చేయండి..



కరపత్రాలు విడుదల చేస్తున్న డీటీ

టేకులపల్లి: ఈనెల 15న గోలియాతండా సేవాలాల్ ఆలయంలో నిర్వహించే బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి వేడుకలను జయప్రదం చేయాలని సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ స్వచ్ఛంధ సంస్థ అధ్యక్షుడు ఇస్లావత్ నామా నాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం టేకులపల్లి తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ ముత్తయ్య చేతుల మీదుగా సేవాలాల్ జయంతి వేడుకల కరపత్రాలను ఆవిష్కరించారు. మాట్లాడుతూ... జాతి యావత్తు అంధకారంలో ఉన్నప్పుడు జాతిని సరైన మార్గంలో పెట్టి, దిశా నిర్దేశం చేసిన దైవాంశ సంభూతుడు, బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలకు బంజారాలతో పాటు అన్నివర్గాల ప్రజలు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ దేవాలయ చైర్మన్ ఇస్లావత్ సాయి కృష్ణ, ప్రవీణ్, రవీందర్, గణేష్ పాల్గొన్నారు.

16న టీయూసీఐ జిల్లా మహాసభ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 16న టీయూసీఐ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని సంఘం జిల్లా కోశాధికారి పెద్దబోయిన సతీష్ పిలుపునిచ్చారు. శనివారం కార్పొరేట్ ఏరియాలోని వివిధ అడ్డాలలో మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు సింగరేణిలో ఇతర రంగాల్లో పనిచేస్తున్న కార్మికులను పర్మనెంట్ చేయాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని లేదా కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో ఖాళీగా ఉన్న క్వార్టర్లను కాంట్రాక్ట్ కార్మికులకు కేటాయించాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల శ్రమను దోచుకుంటోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వై.గోపాలరావు, పుష్పరాజ్, నిర్మల, రాధా వెంకటేశ్వర్లు, మల్లేష్, పుష్ప విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జేసీబీ పట్టివేత



పట్టుబడిన జేసీబీతో ఆర్ఐ హచ్యా

పాల్వంచరూరల్: మట్టిని అక్రమంగా తవ్వి తరలిస్తున్న జేసీబీని రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. కొత్తసూరారం గ్రామంలోని పల్లెప్రకృతి వనం సమీపంలో అక్రమంగా మట్టిని తవ్వి తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న తహసీల్దార్ వివేక్ ఆదేశాల మేరకు శనివారం సంఘటన స్థలానికి వెళ్లగా మట్టిని తరలించే ట్రాక్టర్లు అక్కడ నుంచి పరిపోగా జేసీబీ పట్టుకున్నట్లు ఆర్ఐ హచ్యా తెలిపారు. జేసీబీని పట్టణ పోలీసుస్టేషన్‌లో భద్రత నిమిత్తం ఉంచినట్లు చెప్పారు.

అడ్డంకులు తొలిగేదెన్నడు?

- రైల్వేట్రాక్‌పై దారి మూసివేతతో అవస్థలు
- చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు, ప్రజలు
- పార్క్‌కు వచ్చే సందర్శకులు, క్రీడాకారులకూ తప్పని తిప్పలు



రైల్వే ట్రాక్‌పై మూసివేసిన రహదారి

కొత్తగూడెంఅర్బన్: దశాబ్దాల తరబడి రైల్వే ట్రాక్‌పై ఉన్న రహదారిని అధికారులు మూసివేయడంతో వాహనదారులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. అరకిలోమీటరు వెళ్తే గమ్యం చేరుకునే వారు కిలోమీటరుకు పైగా ప్రయాణం చేస్తున్న పరిస్థితి. వాహనదారులే కాదు, స్థానికులు, సమీపంలోని రాజీవ్ పార్క్, ప్రగతి మైదాన్‌కు వచ్చే క్రీడాకారులు, చిన్నారులు, పెద్దలు ఇలా అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ పరిధిలోని హనుమాన్‌బస్తీ, బూడిదగడ్డ ఏరియా మధ్యలో నుంచి రైల్వే ట్రాక్ దాటుకొని రామా టాకీస్, మధుర బస్తీ, బస్టాండ్ ఏరియా, పోస్టాఫీసు ఏరియాలను కలుపుతూ ఉన్న రహదారిని ఏళ్ల క్రితం రైల్వే ట్రాక్‌పై ప్రమాదాలు జరగవచ్చు అనే కారణంతో రైల్వే అధికారులు ట్రాక్‌పై ఉన్న రహదారిని మూసివేశారు. దీంతో ప్రజలు పట్టణం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉంది. రైల్వే ట్రాక్‌పై నుంచి ఉన్న రహదారిని తెరిచి ప్రజలకు, వాహనదారులకు సౌకర్యం కల్పించాలని రైల్వే అధికారులకు ఎన్నిసార్లు వినతులు అందజేసిన ఫలితం లేకుండా పోయింది. రహదారిని మూసి వేయడం వలన రైల్వే ట్రాక్‌పై నుంచి ప్రజలు ఇష్టానుసారంగా వెళ్లడం వలన ప్రస్తుతం ప్రమాదాలు జరిగే అవకాశం మరింత ఎక్కువగా ఉంది. రహదారిని తెరిపించేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, రైల్వే అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

రైల్వే గేట్ ఏర్పాటుతో సమస్యకు పరిష్కారం..

పట్టణ పరిధిలోని హనుమాన్ బస్తీ, బూడిదగడ్డ మధ్య రైల్వే ట్రాక్‌పై నుంచి ఉన్న రహదారికి ఇరువైపులా కూడా రైల్వే గేట్ ఏర్పాటు చేస్తే అన్నివర్గాల ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుంది. దీంతో పాటుగా ప్రమాదాలకు అవకాశం ఉండదు. రైలు వచ్చి వెళ్లే సమయంలో అక్కడ గేట్ వాచర్‌ను ఏర్పాటు చేయాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. ట్రాక్‌కు అవతల వైపు ఉన్న రాజీవ్ పార్క్‌కు సందర్శకులు, వాకింగ్ చేసేవారు నిత్యం వందల మంది వస్తుంటారు. దీంతో పాటుగా పక్కనే ఉన్న ప్రగతి మైదాన్‌కు కూడా ఉదయం, సాయంత్ర వేళల్లో క్రీడాకారులు, వాకింగ్ చేసే అన్నివర్గాల ప్రజలు నిత్యం వందల సంఖ్యలో వచ్చిపోతుంటారు. ట్రాక్‌పై రహదారి మూసి ఉండడం వలన వారంతా పట్టణం చుట్టూ తిరిగి వచ్చిపోతున్నారు. దీంతో పాటుగా హెడ్డాఫీసు ఏరియా, బస్టాండ్, పోస్టాఫీసు సెంటర్, రామా టాకీస్ ఏరియాల వారు కూడా నిత్యం ఇబ్బంది పడుతున్నారు. ఆ ప్రాంతంలో రైల్వే గేట్‌ను ఏర్పాటు చేస్తే వేల మంది ప్రజలు, వాహనదారులకు ప్రయోజనం చేకూరుతుంది. ఈ విషయంలో మున్సిపల్ అధికారులు కూడా చొరవ తీసుకొని ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని, రైల్వే అధికారులకు సమస్యను వివరించి ప్రజలకు సౌకర్యం కల్పించాలని బాధితులు అభిప్రాయపడుతున్నారు. మున్సిపల్ కౌన్సిల్ ఉన్న సమయంలో రైల్వే గేట్‌పై తీర్మానం చేసి రైల్వే అధికారులకు పంపాలని పలుమార్లు స్థానికులు వినతులు చేసినా కౌన్సిల్‌లో ఈ అంశాన్ని పెట్టలేదు, చర్చ కూడా జరగలేదు. అంటే ప్రజల ఇబ్బందులు, సమస్యలను కౌన్సిల్ సభ్యులు ఏ విధంగా పట్టించుకున్నారో అర్థం చేసుకోవచ్చు. ఈ అంశంపై ఎంపీ చొరవ చూపితే సమస్యకు పరిష్కారం లభిస్తుందని స్థానికులు అంటున్నారు.

రైల్వే అధికారులకు తెలియజేస్తాం..



పట్టణ పరిధిలోని హనుమాన్ బస్తీ, బూడిద గడ్డ మధ్యలో నుంచి రైల్వే ట్రాక్‌పై ఉన్న రహదారిని తెరిస్తే వాహనదారులకు, ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుంది. ఉన్న రహదారిని మూసి వేయడం వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అక్కడ రైల్వే గేట్ ఏర్పాటు చేయాలని అధికారులకు విన్నవిస్తాను.

– శ్రీనివాసరెడ్డి, సెంట్రల్ రైల్వే డీఆర్‌యూసీసీ మెంబర్

పలుమార్లు విన్నవించాం..



పట్టణంలోని రైల్వే ట్రాక్ మీదుగా ఉన్న రహదారిని తెరిచి ప్రజలకు, వాహనదారుల ఇబ్బందులు తొలగించాలని రైల్వే అధికారులకు పలుమార్లు విన్నవించాం. ఎంపీ, రైల్వే జీఎం, స్థానిక రైల్వే అధికారులకు మరోసారి వినతులు అందజేస్తాం. రైల్వే గేట్‌ను ఏర్పాటు చేసేందుకు అన్నిరకాలుగా పోరాటం చేస్తాం.

– పాండురంగాచార్యులు, కొవ్వూరు రైల్వేలైన్ సాధన కమిటీ కన్వీనర్

బాలమేళాతో సృజనాత్మకత పెంపు



ముత్యాలంపాడు పాఠశాలలో విద్యార్థులతో కాంప్లెక్స్ హెచ్ఎం, టీచర్లు



తావుర్యా తండా యూపీఎస్‌లో..

టేకులపల్లి: తరగతి గదుల్లో విద్యార్థులు సంపాదించిన జ్ఞానాన్ని, నైపుణ్యాలను (విద్యార్థుల అభ్యాస ప్రదర్శన, సృజనాత్మకత ప్రతిభ) పరిశీలన చేసే విధానంతో విద్యాశాఖ ఏర్పాటు చేసిన ఎఫ్ఎల్ఎన్ బాలమేళా పరిశీలన బృందం శనివారం ముత్యాలంపాడు కాంప్లెక్స్ పరిధిలోని తావుర్యాతండా యూపీఎస్, ముత్యాలంపాడు (హెచ్‌సీ) ప్రాథమిక పాఠశాలను సందర్శించింది. పాఠశాలల్లో తరగతుల వారీగా విద్యార్థుల నైపుణ్యాలను, అభ్యాసన ప్రతిభ, సృజనాత్మకత అంశాలను పరిశీలించారు. విద్యార్థులతో చదివించడం, రాయించడం, విభిన్న నేపథ్యాల నుంచి ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ముత్యాలంపాడు కాంప్లెక్స్ హెచ్ఎం రామచందర్‌సింగ్, యూపీఎస్, ఎంపీపీఎస్ హెచ్ఎంలు ఎల్.లక్ష్మణ్, బి.సుజాత, టీచర్లు అబ్బయ్య, పద్మ, అనురాధ, స్వర్ణ పాల్గొన్నారు.

ఓసీలో గుర్తింపు సంఘం నేతల పర్యటన



జేకే ఓసీలో పర్యటిస్తున్న నాయకులు

ఇల్లెందు: ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధి బృందం శనివారం జేకే ఓసీ పని ప్రదేశంలో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా వర్కర్స్ యూనియన్ కేంద్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె.సారయ్య మాట్లాడుతూ... ఉత్పత్తి, రక్షణలో ఇల్లెందు ఏరియా అగ్రస్థానంలో ఉందన్నారు. ఇటీవల దుర్గా కంపెనీ ఓబీ టెండర్ పొందారని, టెండర్ కాలపరిమితి ముగిసిన తర్వాత జేకే ఓసీ ఇల్లెందులో గత 21 ఫిట్ మైన్ మూసివేసిన తర్వాత కార్మికుల సంఖ్య తగ్గిందని, జేకే ఓసీని జీఎం, పీఓ, మేనేజర్, అధికారులు, కార్మికులు సమష్టిగా పాత మిషనరీ, మ్యాన్ పవర్ తక్కువ ఉన్నా మూడేళ్లుగా అధిక ఉత్పత్తి సాధించినట్లు చెప్పారు. కార్మికుల కృషితో ఎన్నో అవార్డులు సాధించిన చరిత్ర జేకే ఓసీకి ఉందన్నారు. బొగ్గు నిల్వలు అడుగంటే లోపే జేకే ఓసీ విస్తరణ చేయాలని కోరారు. జేకే ఓసీ బ్లాస్టింగ్ ఇన్‌చార్జ్ కిషన్, బ్రాంచి ఉపాధ్యక్షుడు దాసరి రాజారామ్, ఫిట్ కార్యదర్శి సంజీవచారి, బ్రాంచి సెక్రెటరీ నజీర్ అహ్మద్ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడిగా పవన్ కుమార్



జూలూరుపాడు: ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడిగా జూలూరుపాడు మండలం వినోభానగర్‌కు చెందిన పెరుమాళ్ల పవన్ కుమార్ ఎన్నికయ్యారు. ఇటీవల పాల్వంచ పట్టణంలో జరిగిన ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభల్లో జిల్లా కమిటీ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా శనివారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

పారిశుద్ధ్యం అధ్వానం



కొమ్ముగూడెంలో నిరుపయోగంగా రక్షిత మంచినీటి పథకం విద్యుత్ మోటార్

జూలూరుపాడు: కొమ్ముగూడెం గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్యం పడకేసిందని భారతీయ గోర్ బంజారా పోరాట సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బానోత్ దుర్గాప్రసాద్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ... కొమ్ముగూడెం గ్రామ పంచాయతీకి రెగ్యులర్ కార్యదర్శి లేకపోవడంతో పారిశుద్ధ్యం పనులు సక్రమంగా చేపట్టకపోవడం వల్ల డ్రెయినేజీల్లో చెత్త పేరుకపోయి దుర్గంధం వెదజల్లుతోందన్నారు. పంచాయతీ కార్యదర్శిని నియమించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోయారు. మిషన్ భగీరథ నీటి సరఫరా జరగకపోవడంతోపాటు చేతి పంపులు మూలనపడటంతో తాగునీటి కోసం ప్రజలు అవస్థలు పడుతున్నట్లు చెప్పారు. వేసవికాలంలో మరింత తాగునీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామ పంచాయతీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.

అధికారులకు పీఆర్‌పీ ఇప్పించండి..



జీఎం శాలేంరాజుకు వినతిపత్రం అందజేస్తున్న అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): సంస్థలో పనిచేసే అధికారులకు పెర్ఫామెన్స్ రిలేటెడ్ పే (పీఆర్‌పీ) ఇవ్వాలని కోల్‌మైన్స్ ఆఫీసర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సింగరేణి వింగ్) నాయకులు శనివారం కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజుకు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ... 2022–23, 2023–24లో నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించటడంలో అధికారుల పాత్ర ఎంతో ఉందని, దీనికి సంబంధించిన పెర్ఫామెన్స్ రిలేటెడ్ పే (పీఆర్‌పీ) ఇంత వరకు సంస్థ ఇవ్వలేదని, కోలిండియాలో ఇచ్చారని, సింగరేణిలో ఆ ఊసేలేదన్నారు. కనీస వసతులు లేకున్నా సంస్థ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్నామని, అధికారులను ప్రోత్సహించే పీఆర్‌పీ వెంటనే ఇప్పించాలని కోరారు. స్పందించిన జీఎం సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఎంఓఏఐ ప్రెసిడెంట్ ఎంవీ నరసింహారావు, వైస్ ప్రసిడెంట్ రమేష్, అజ్మీర శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ ఏ.ఉపేందర్ బాబు, జాయింట్ సెక్రటరీ ప్రదీప్, జాయింట్ ట్రెజరర్ వైపీ రావు, బీఈసీ సభ్యులు యాదగిరి, శేషశ్రీ, ఏరియా ఆఫీసర్లు పాల్గొన్నారు. అదేవిధంగా కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలోని వివిధ విభాగాలలో పనిచేస్తున్న సుమారు 100 మంది అధికారులు కార్పొరేట్ సేఫ్టీ జీఎం చింతల శ్రీనివాస్‌కు కార్పొరేట్ సీఎంఓఏఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. అధికారుల సమస్యలను సీఎండీ దృష్టికి తీసుకెళ్లాలని, పెండింగ్ పీఆర్‌పీని రిలీజ్ చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.విజయ్ భాస్కర్‌రెడ్డి, పి.రాజీవ్‌కుమార్, రాజ్‌గోపాల్, ఏ.సునీల్‌వర్మ, సాయిబాబు, ఎం.కనకయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలను విడనాడాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: రంగురాళ్లు, వీభూది, చేతబడులు తదితర వాటితో కొందరు మోసగాళ్లు ప్రజలను మూఢ నమ్మకాల వైపు నడిపిస్తున్నారని, వీటిని నమ్మొద్దని సైన్ ఉపాధ్యాయురాలు ధర్మప్రియ అన్నారు. శనివారం జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాంనగర్‌లోని ఎస్ఆర్‌డీజీ పాఠశాలలో చార్లెస్ డార్విన్ జీవ పరిణామక్రమ సిద్ధాంత ప్రచారోద్యమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డార్విన్ ప్రతిపాదించిన జీవ పరిణామ క్రమంలో మానవులు, జంతువులు, ఇతర ప్రాణులు మార్పు చెందడానికి కొన్ని కోట్ల సంవత్సరాలు పట్టిందని పేర్కొన్నారు. జన విజ్ఞాన వేదిక కార్యదర్శి తిరుపాలు ఇంద్రజాల ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర బాధ్యురాలు ఎ.కస్తూరి, జిల్లా ప్రధాన కార్యదర్శి ముగడ మోహన్‌రావు, ఉపాధ్యక్షులు సాయిబాబా, స్కూల్ బాధ్యులు రమేష్, సంపత్, ప్రిన్సిపాల్ తిరుమలరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు

నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి



శ్వేతను సన్మానిస్తున్న అధ్యాపకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో రైజ్ అండ్ షైన్ ఎనలైజింగ్ ది పవర్ విత్ ఇన్ అనే అంశంపై కళాశాల ఆడిటోరియంలో శనివారం సెమినార్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఎస్ శ్వేత (యూఎస్ఏ డైరెక్టర్ ఆఫ్ టెక్నాలజీ ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్ ఎట్ వెలాసిటీ క్లినికల్ రీసెర్చ్) హాజరై ప్రసంగించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో యువతులు, విద్యార్థులు తమలో నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటూ ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఒక లక్ష్యంతో మానసిక స్థైర్యాన్ని పెంపొందింపజేసుకుంటూ అవరోధాలను అధిగమిస్తూ విలువలతో కూడిన నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలన్నారు. సాంకేతిక నైపుణ్యాలతో పక్కా ప్రణాళికతో వ్యవహరిస్తే విజయాన్ని అందుకోవచ్చన్నారు. కళాశాల ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ జి.శ్రీనివాస్ మాట్లాడుతూ.. సింగరేణి విద్యాసంస్థలలో విద్యాభ్యాసం చేసి గురువుల ప్రోత్సాహంతో చిన్న వయస్సులోనే అంతర్జాతీయ స్థాయిలో టాప్ 50 బిజినెస్ లీడర్లలో ఒకరిగా నిలిచిన శ్వేత సింగరేణి విద్యాసంస్థల పూర్వ విద్యార్థిని కావడం సింగరేణి సంస్థకు గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా శ్వేతను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సెమినార్ నిర్వాహక కార్యదర్శి డాక్టర్ జి.శైలజ, ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శారద, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

కవితపై విమర్శలు సరికాదు



మాట్లాడుతున్న కాపు కృష్ణ, పక్కన నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): టీబీజీకేఎస్ గౌరవాధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను విమర్శించే హక్కు జనక్ ప్రసాద్‌కు లేదని, ఆయన మానసిక స్థితి సరిగా లేదని, ఆయనకు రానున్న ఎన్నికల్లో సరైన బుద్ధి చెబుతామని టీబీజీకేఎస్ ఛీఫ్ జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ, వైస్ ప్రసిడెంట్ కూసన వీరభద్రయ్య అన్నారు. శనివారం కొత్తగూడెం ఏరియా రామవరంలోని యూనియన్ కార్యాలయంలో జరిగిన అత్యవసర సమావేశంలో వారు మాట్లాడారు. కవితపై ఐఎన్‌టీయూసీ నాయకులు మాట్లాడటం సరైంది కాదని, ఆమె గతంలో సీఎం కేసీఆర్‌తో మాట్లాడి అనేక హక్కులు తేవటం జరిగిందని, సుమారు 3,200 పెండింగ్‌లో ఉన్న డిపెండెంట్ ఉద్యోగాలు ఇవ్వటం జరిగిందన్నారు. కోలిండియాలో లేని మ్యాచింగ్ గ్రాంట్ రూ.పది లక్షలు కలిపి ఇచ్చినట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణికి వచ్చిన రూ.4,700 కోట్ల లాభాల్లో రూ.2,289 కోట్లు పక్కన పెట్టి 16.7 శాతం రూ.2,411 కోట్లను పంచి కార్మికులను ఆర్థిక దోపిడీ చేసిందన్నారు. ఐఎన్‌టీయూసీ హయాంలో గోల్డెన్ హ్యాండ్ షేక్ పేరుతో 10 వేల మందిని ఉద్యోగం నుంచి తొలగించారని తెలిపారు. ఇటువంటి ఘనకీర్తి కలిగిన ఐఎన్‌టీయూసీ టీబీజీకేఎస్‌ను విమర్శించే హక్కు ఉందా అని ప్రశ్నించారు. ఎన్నికల ముందు అమలుకు సాధ్యం కాని ఎన్నో వాగ్దానాలు.. కార్మికులకు 250 గజాలు ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి వడ్డీ లేని రూ.20 లక్షల రుణం, ఇన్‌కమ్ ట్యాక్స్ రద్దు వంటి అనేక హామీల్లో ఏ ఒక్క హామీనీ అమలు చేయలేక పోయిందని రానున్న ఎన్నికల్లో కార్మికులే తగిన బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో గడప రాజయ్య, తుమ్మ శ్రీనివాస్, రాసూరి శంకర్, కాగితపు విజయ్‌కుమార్, మీసాల మురళీ, అశోక్, రవివర్మ, సూర్యనారాయణ, సూరజ్, రాజ్‌కుమార్, తిరుపతి, అనుదీప్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలోనూ బీజేపీ విజయం ఖాయం

పాల్వంచరూరల్: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ ఘనవిజయం సాధించింది. ఈ మేరకు శనివారం స్థానిక బీజేపీ నాయకులు పట్టణంలో సంబురాలు జరుపుకున్నారు. బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పానిశెట్టి వెంకటేశ్వర్లు వేర్వేరుగా నాయకులకు, కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాపాక రమేష్, భూక్యా రవికుమార్, రజింత్, ముకుంద్‌రెడ్డి, సందీప్, శివ, నాగరాజు, మురళీ, అవినాష్, జి.శంకర్, ఎం.లక్ష్మణ్, గుండురాజు, ఎం.ప్రశాంత్, వెంకన్న, రాము, విజయ్, నరేందర్, శ్రీను, సత్యం తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అన్నివర్గాల ప్రజలు ఆదరించారు..

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ ఘన విజయం సాధించిందంటే అన్నివర్గాల ప్రజలు ఆదరించారని కొత్తగూడెం నియోజకవర్గ బీజేపీ కోకన్వీనర్ బుడగం రవికుమార్ అన్నారు. పార్టీ విజయం పట్ల శనివారం స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో నాయకులు అంబేడ్కర్ విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాణసంచాను కాల్చి, మిఠాయిలు పంపిణీ చేసి సంబురాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీతారాం నాయక్, ఎడ్లపల్లి శ్రీనివాస్, దున్నపోతుల రాజు, కాల్వ ప్రసాద్, కాల్వ సుధాకర్, ప్రతాప్, వీరన్న, గిరిగౌడ్, తిరుపతయ్య, శ్రీను, పవన్, రామానాయుడు, శ్రావణ్, ధనలక్ష్మి పాల్గొన్నారు.

జూలూరుపాడు: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడం పట్ల బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం జూలూరుపాడులో ఆయన మాట్లాడుతూ.. ఢిల్లీ శాసనసభ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ విజయఢంకా మోగించిందన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారన్నారు. తెలంగాణ ప్రజలు కూడా బీజేపీ వైపు చూస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో కాషాయం జెండా ఎగరడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మాదినేని సతీష్, తెల్లం నరసింహారావు, సున్నా రమేష్, సిరిపురపు ప్రసాద్, భూక్యా రాజేష్, భూక్యా శ్రీను, రమేష్, పూరేటి వెంకటేశ్వర్లు, సిరిపురపు పుల్లారావు, గోపాల్‌రావు, సురేందర్ పాల్గొన్నారు.

టేకులపల్లి: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ ఘన విజయంపై టేకులపల్లి బీజేపీ శ్రేణులు శనివారం సంబరాలు జరుపుకున్నారు. మండల అధ్యక్షుడు తేజావత్ శంభునాయక్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో స్వీట్లు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో చిక్క వెంకటేశ్వర్లు, మంగ్యా, డి.ద్రావిసింగ్, రాజు, సురేష్, నరేష్, అప్పారావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



పాల్వంచరూరల్: అంబేడ్కర్ సెంటర్‌లో సంబురాలు జరుపుకుంటున్న నాయకులు



టేకులపల్లి: స్వీట్లు తినిపించుకుంటున్న నాయకులు

ఎన్నికల హామీల అమలుకు పోరాడుదాం..



ఇల్లెందు: మాట్లాడుతున్న సారంగపాణి



ఇల్లెందురూరల్: మాట్లాడుతున్న సుభద్ర

ఇల్లెందు: అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రజలకు, కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఈ నెల 20న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) జిల్లా అధ్యక్షుడు కె.సారంగపాణి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ రాసుద్దీన్, రాష్ట్ర నాయకుడు తోడేటి నాగేశ్వరరావు ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం ఇల్లెందులోని ఇఫ్టూ కార్యాలయంలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మికులను పర్మనెంట్ చేయాలని, కనీస వేతనం నెలకు రూ.26 వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, సంఘటిత, అంఘటితరంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. పేదలందరికీ పక్కా ఇళ్లు, రేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఆరు గ్యారంటీల పేరుతో వాగ్దానాలు చేసి అమలులో తీవ్ర జాప్యం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నరాటి వెంకన్న, డి.మోహన్‌రావు, కొప్పుల శ్రీనివాస్, టి.సామేల్, ఆర్.నర్సింహారావు, అంజయ్య, ఆర్.మోహన్‌రావు, ఎం.వెంకటేశ్వర్లు, ఎస్.శ్రీను, రాజులోథ్, పి.రమేష్, బాలు, పాలేపు రవి, రేసు కృష్ణ, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల అమలుకు ఉద్యమిద్దాం..

ఇల్లెందురూరల్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతలు ప్రకటించిన ఆరు గ్యారెంటీలను నూరు శాతం అమలు చేసే వరకు ఉద్యమిద్దామని పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కల్తి సుభద్ర పిలుపునిచ్చారు. ఈ మేరకు ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఈ నెల 20న నిర్వహిస్తున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. చల్లసముద్రం గ్రామపంచాయతీలో చలో హైదరాబాద్ కార్యక్రమంపై శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో నరాటి వెంకటేశ్వర్లు, సింగు గురుస్వామి, సైదులు, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.